

గోదారి తీరాన నృత్యోత్సవం

నృత్య నీరాజనంతో గోదారితీరం పులకించనుంది. వంద మందికి పైగా నృత్య కళాకారులు ఒకే వేదికపై నాలుగు రోజులపాటు నగర ప్రజలను పరవశింపజేయనున్నారు.


8 లో



సత్యదేవుని సన్నిధికి సులువుగా!

రత్నగిరి సత్యదేవుని సత్యదేవుని దర్శనానికి మరో మార్గానికి పనులు చురుగ్గా సాగుతున్నా యి. మొదటి ఘాట్‌రోడ్డు వద్ద గల టోల్‌గేట్ నుంచి రెండో మెట్లదారి నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

16,050 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 16,050 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. డెల్టా కాలువలకు 4,650 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద 10.25 అడుగుల నీటిమట్టం నెలకొంది.

న్యూస్‌రీల్

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా 'సాక్షి'పై దాడులు



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలంలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందని, అందుకే చంద్రబాబు, లోకేష్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు 'సాక్షి' కార్యాలయంలపై కూటమి నేతలు పెట్రోల్ బాటిల్‌తో దాడులు చేసి తగులబెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వానికిపత్రికా స్వేచ్ఛపై చిత్తశుద్ధి ఉంటే దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసుల బనాయించి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. ఏపీలో మహిళలకు రక్షణ కరవైందని, చిన్నారులపై లైంగిక దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా తప్పుడు రాజకీయాలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పాత్రికేయులకు పూర్తి స్వేచ్ఛ రాజ్యాంగంలో కల్పించబడిందని, ఈ కూటమి ప్రభుత్వం హక్కులను కాలరాస్తుందన్నారు. ఇప్పటికైనా తప్పుడు విధానాలను మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయిస్తే కోర్టు, ఎస్పీ, డీఎస్పీలకు మోమోలు జారీ చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుకు పాల్పడుతుందని కోర్టు వేసిన అక్షింతలు ద్వారా తెలుస్తుందన్నాని ఇజ్రాయిల్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విధానం మార్చుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు దారుణం



సూర్యనారాయణ రావు, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టులు, వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసి వేధించడం దారుణమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ముఖ్యంగా సీనియర్ జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఎమ్మెల్సీ ఖండించారు. అమలాపురం హైస్కూలు సెంటరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు బుధవారం సాయంత్రం స్థానిక మీడియాతో మాట్లాడారు. ఈ అక్రమ కేసులను చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? కక్ష సాధింపు చర్యల్లో ఉన్నామా? అనే సందేహం కలుగుతోందన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రభుత్వం 'సాక్షి' కార్యాలయాల ఎదుట ధర్నాలు, కేసులు అనే కొత్త నాటకానికి తెర తీసిందని చెప్పారు. జర్నలిజాన్ని నేటి కూటమి ప్రభుత్వం ఖతం చేసే ప్రయత్నంలో ఉందని అన్నారు. ప్రభుత్వం కూటమి పార్టీల నేతలకే రక్షణగా నిలుస్తోందని విమర్శించారు. తుపాకీ గొట్టంతో రాజ్య హింస ద్వారా నియంత పాలన రుచి చూపిస్తోందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ఆరోపించారు.

జిల్లాలో నాలుగు రోజులు విద్యుత్ అంతరాయం



అమలాపురం రూరల్: జిల్లాలో గురువారం నుంచి 16 తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్ఈ రాజబాబు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దశలవారీగా కోతలు విధిస్తామని పేర్కొన్నారు. అమలాపురం, కొత్తపేట, రాజోలు, ముమ్మిడివరం పరిధిలో ఉన్న ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అమలాపురం మున్సిపాలిటీ, అమలాపురం రూరల్, అల్లవరం, అయినవల్లి, అంబాజీపేట, రాజోలు, మామిడికుదురు, పి.గన్నవరం, మలికిపురం, సఖినేటిపల్లి, కొత్తపేట, రావులపాలెం మండలాలకు, రామచంద్రపురం టౌన్-2, ద్రాక్షారామ, రాయవరం, కపిలేశ్వరపురం కె.గంగవరం మండలాల పరిధిలో స్వల్పంగా విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం

అమలాపురం రూరల్: జిల్లాలో 1,534 ప్రభుత్వ పాఠశాలలు, 62 సంక్షేమ హాస్టళ్లలో గురువారం నుంచి మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం వినియోగిస్తామని జేసీ టీ.నిషాంతి ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సన్న బియ్యాన్ని సరఫరా చేశామన్నారు.

జగన్ పాలన...
అభివృద్ధికి నమూనా

- ప్రగతి అంటే అదే కదా
- నాడు విద్యా వైద్యానికి పెద్ద పీట
- 198 సచివాలయాలు.. 68 ఆర్‌బీకేలు..
- 35 హెల్త్ సెంటర్లు.. కమ్యూనిటీ భవనాలు..
- గ్రామాల సమగ్ర అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం
- నేడు అమరావతి తరహాలో గ్రాఫిక్స్
- అరచేతిలో వైకుంఠం
- పడకేసిన పల్లె అభివృద్ధి
- ఆగిపోయిన నిర్మాణాలు
- కొన్ని రోడ్ల మీదనే గోతులు పూడ్చివేత
- నత్తను తలపిస్తున్న ప్రధాన నిర్మాణాలు



సాక్షి, అమలాపురం: అభివృద్ధి అంటే గ్రాఫిక్స్ కాదు. నగరాలు, పట్టణాలలో డివైడర్లు, వాటర్ ఫౌంటెన్లు, హంగులూ.. ఆర్భాటాలే కాదు. అభివృద్ధి అంటే పల్లెల నుంచి పట్టణాల వరకు సమగ్రంగా ప్రగతి కనిపించాలి. రోడ్లు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు జరగాలి. రైతులకు అవసరమైన సామగ్రి, ఆధునిక పరికరాలు అందుబాటులో ఉండాలి. కమ్యూనిటీ భవనాలు వంటి సౌకర్యాలు కలగాలి. నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగాలి. అప్పుడే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి జరుగుతుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి అభివృద్ధి కళ్లకు కట్టింది. రాష్ట్రంలో అధికారం మారిన తరువాత ఆ అభివృద్ధి ఏడాది కాలంగా కుంటుపడింది.

నాడు



కలెక్టరేట్

నెరవేరిన కొత్త జిల్లా ఆశలు

పాత కోనసీమ (అమలాపురం డివిజన్)తో పాటు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలతో ఏప్రిల్ 2, 2022న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడింది. ఏడు నియోజకవర్గాలలో అమలాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీలతోపాటు 22 మండలాలు, 315 పంచాయతీలు, 515 సచివాలయాలతో ఏర్పడిన ఈ జిల్లాలో గోదావరి సప్త నదీపాయలు ప్రవహిస్తుండడం విశేషం. కొత్త జిల్లాలో పరిపాలనా పరమైన పనులను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేగంగా చేపట్టింది. కలెక్టరేట్‌తోపాటు అన్ని ప్రభుత్వ శాఖలను ఏర్పాటు చేయడం, వాటికి అధికారులను నియమించడం చకచకా సాగిపోయాయి.



పల్లవారిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధుల రూ.3.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనం

గ్రామాలలో సమగ్రాభివృద్ధి

- జిల్లాలో గ్రామ సచివాలయాలు 198, రైతు భరోసా కేంద్రాలు 68, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 35 భవనాలను నిర్మించారు.
- జిల్లాలో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నాడు-నేడులో రూ.9.21 కోట్లతో మంజూరయ్యాయి.
- గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 515 సచివాలయాలలో ప్రభుత్వం అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇందుకుగాను 1,102 పనులకు రూ.72.88 కోట్ల నిధులు ఖర్చు చేశారు.
- గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంటికీ కుళాయి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో 'జల జీవన్ మిషన్' ద్వారా జిల్లాలోని ఒక వెయ్యి 834 ఆవాస ప్రాంతాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి రూ.515.93 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్‌ల నిర్మాణం చేపట్టారు. జగనన్న కాలనీల్లో 209 లే అవుట్లలో నిర్మించిన కుళాయిల ఏర్పాటుకు రూ.45.75 కోట్లు కేటాయించారు. గోదావరి నుంచి నేరుగా నీటిని అందించేందుకు మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు ప్రభుత్వం అంకురార్పణ చేసింది. ఇందుకు రూ.1,650 కోట్లు మంజూరు చేశారు.
- 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు'లో భాగంగా జిల్లాలో మొదటి విడతగా 24,644 గృహాలను 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన - వైఎస్సార్ పట్టణ పథకం' ద్వారా రూ.443.59 కోట్లతో నిర్మించారు. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన- వైఎస్సార్ గ్రామీణ' పథకం ద్వారా 9,810 గృహాలను రూ.176.58 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు.

నేడు



ఐ.పోలవరం మండలం మురమళ్లలో నిలిచిపోయిన ఆర్‌బీకే భవనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో జిల్లా వాసులు అభివృద్ధి కార్యక్రమాలు అంటే కేవలం అమరావతి గురించి మాత్రమే వింటున్నారు. గ్రామాల్లో కేవలం చిన్నచిన్న రోడ్లు వేయడం, రోడ్ల మరమ్మతులు సైతం అద్భుతంగా చేస్తున్నామని చెప్తున్నా కూటమి నేతలు కీలకమైన రోడ్ల మరమ్మతులను గాలికి వదిలేశారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అమలాపురంలోని నల్లవంతెన ఎర్రవంతెన మధ్య ఉన్న రోడ్డు చూస్తే అర్థమవుతుంది అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు ఇంటిని అనుకుని ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయలేదు.

- గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు దాదాపు నిలిచిపోయాయి.
- ప్రైమరీ హెల్త్ సెంటర్ల ఆధునీకరణ పనులకు కూడా గ్రహణం పట్టింది.
- ఇంటింటా కుళాయి అందించే జలజీవన్ మిషన్ పనులు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి.
- పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ, ఇళ్ల నిర్మాణాలకు రాయితీలు అందించడం కూడా మందకొడిగా సాగుతోంది.
- గత ప్రభుత్వంలో మంజూరైన నాడు - నేడు రెండో దశ పనులు ఆగిపోయాయి. ఈ వేసవి సెలవుల్లో పాఠశాలల్లో అభివృద్ధి పనులు అరకొరగానే సాగాయి.
- పి.గన్నవరం మండలం ఊడిమూడిలంక, గంటిపెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక వాసులకు నిర్మిస్తున్న వంతెన పనులు మందకొడిగా సాగుతున్నాయి.
- జాతీయ రహదారి 216 పనులకు సంబంధించి ఏడాదికాలంలో మామిడికుదురులోని బైపాస్ నిర్మాణ పనులకు పురోగతి లేకుండా పోయింది.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి పంచాయతీ సూదాపాలెం వద్ద సచివాలయం-2, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు




కె.గంగవరం మండలం పామర్రులో ఆధునీకరించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లిలో వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు

మెరుగుపడిన రహదారులు.. లంకలకు వంతెనలు



ఐ.పోలవరం మండలం పశువుల్లంక మొండి వద్ద వృద్ధగౌతమీ పాయపై నిర్మించిన వంతెన



అమలాపురం మండలం పేరూరు ఎత్తు రోడ్డు వద్ద నుంచి అల్లవరం మండలం ఓడలరేవు వద్ద వరకు ఆధునీకరించిన రహదారి

- జిల్లాలో గడిచిన ఐదేళ్లలో రహదారులు, భవనాల నిర్మాణాలకు రూ.299.40 కోట్లు మంజూరయ్యాయి. రూ.166.4 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. 33 రోడ్లకు రూ.42.87 కోట్లతో మరమ్మతులు చేశారు. రెండవ దశలో రోడ్ల రిపేర్లకు రూ.26.37 కోట్లు ఖర్చు చేశారు.
- కత్తిపూడి -ఒంగోలు మధ్య ఉన్న జాతీయ రహదారి 216 విస్తరణ పనులు వేగంగా సాగడానికి భూసేకరణ చురుగ్గా చేయడమే కారణం. 374 కిమీలు నిడివి ఉన్న ఈ రహదారిని రూ.నాలుగు వేల కోట్లతో విస్తరించింది. దశాబ్దాల కాలంగా రాజోలు దీవివాసులు ఎదురుచూస్తున్న వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణానికి ఎన్‌హెచ్ రూ.580.42 కోట్ల నిధులు మంజూరు చేసింది. రామరాజులంక వద్ద వశిష్ఠపై 380 మీటర్ల మేర వంతెన నిర్మాణం చేయనున్నారు.
- పి.గన్నవరం మండలం ఊడిమూడిలంక, గంటి పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక వాసుల కష్టాల తీర్చేందుకు రూ.49.50 కోట్లతో వంతెన పనులు మొదలయ్యాయి.
- ముమ్మిడివరం- ఐ.పోలవరం సరిహద్దులను ఆనుకుని వృద్ధగౌతమీ, గౌతమీ నదీపాయల మధ్య ఉన్న పశువుల లంక మొండి వద్ద రూ.49 కోట్లతో వంతెనను పూర్తి చేయించిన జగన్‌మోహన్‌రెడ్డి సీఎం హోదాలో ప్రారంభించారు.

విద్యా సుగంధాలు



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు

జిల్లాలోని మనబడి నాడు-నేడు పథకం ఫేజ్-1లో 436 పాఠశాలలను రూ.104.96 కోట్లతో అభివృద్ధి చేశారు. ఫేజ్-2లో 761 పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.257 కోట్లు మంజూరు చేశారు. ఎస్ఎంఎఫ్ (స్కూల్ మెయింటినెన్స్ ఫండ్) కేటాయించి పాఠశాలలో చిన్నచిన్న పనులకు రూ.27.76 కోట్లు కేటాయించారు. 142 పాఠశాలకు 945 ఇంటరేక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)లు అందించారు. ఒక్కొక్క దాని ఖరీదూ రూ.1.25 లక్షలు. దీని ద్వారా డిజిటల్ బోధనతోపాటు పాఠాలను డౌన్‌లోడు చేసుకుని కూడా చెప్పే అవకాశం అధికంగా ఉంది.

యోగా పోటీలలో ప్రతిభ చాటాలి



యోగా పోటీల సందర్భంగా మాట్లాడుతున్న ఆయుష్ వైద్యాధికారులు

అమలాపురం రూరల్: యోగాంధ్ర మాస ఉత్సవాలలో భాగంగా పోటీలలో పాల్గొని ప్రతిభ చాటి జిల్లా పేరు ప్రఖ్యాతులు జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం గోదావరి భవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో.. సోలో విభాగంలో 10-18 మధ్య వయసు వారు 8 మంది పాల్గొన్నారు. 19- 35 మధ్య వయసువారు ముగ్గురు, 35 సంవత్సరాలు పైబడిన వారు నలుగురు పాల్గొన్నారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14 వరకు పోటీలలో పాల్గొనవచ్చునన్నారు. విజేతలకు ఈ నెల 21వ తేదీ విశాఖపట్నంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీతో కలసి పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ కనకదుర్గ, జి.దుర్గాప్రసాద్. సీహెచ్ ఉషారాణి, డి.శాంతకుమారి, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. 12వ తేదీన కలెక్టరేట్ లో పోటీలు ఉదయం 7.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామని యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి ఆయుష్ వైద్యాధికారి విజయకుమారి తెలిపారు.

తడబడితూ..

- నేటి నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం
- పునఃప్రారంభానికి ముస్తాబైన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు
- పూర్తి కాని ఉపాధ్యాయ బదిలీలు
- పూర్తి స్థాయిలో చేరని స్టూడెంట్ కిట్స్
- జిల్లాలో 1,576 ప్రభుత్వ, 451 ప్రైవేట్ పాఠశాలలు

సాక్షి, అమలాపురం: వేసవి సెలవులు పూర్తయ్యాయి. మళ్లీ బడికి వేళయింది. ఓ వైపు ప్రైవేట్ పాఠశాలలు సకల సౌకర్యాలతో విద్యార్థులను రారా రమ్మని స్వాగతం పలుకుతున్నాయి. మరోవైపు సర్కారు బడులు ఇంకా సౌకర్యాల లేమితోనే విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో గురువారం నుంచి 2025-26 విద్యా సంవత్సరం బడి గంటలు మోగనున్నాయి. విద్యార్థుల ఉరుకులు పరుగులు..కేరింతలు మొదలవనున్నాయి.

నేటి నుంచి సందడి

ప్రతి ఉదయం విద్యార్థులు ఓ పక్క, వారి తల్లిదండ్రులు మరోపక్క ఉరుకులు, పరుగులు పెట్టనున్నారు. అటెన్షన్ ప్లీజ్..సైలెన్స్ ప్లీజ్ అంటూ టీచర్ల పని ప్రారంభం కానుంది. ఇక విద్యార్థులకు స్వాగతం పలికేందుకు అటు సర్కారు..ఇటు కార్పొరేట్ పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను ఆకర్షించేందుకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కరపత్రాలు, ఫ్లెక్సీలతో ప్రచారం చేశారు. అయితే ఎంత మేర అడ్మిషన్లు వస్తాయన్నది వేచి చూడాలి.

ప్రహసనంగా బదిలీలు

పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. గత నెల 21 నుంచి ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ పాఠశాలలు పునఃప్రారంభించే నాటికి పూర్తి కాలేదు. బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యకం చేశాయి. ఎస్‌జీటీలకు మాన్యువల్ విధానంలో బదిలీలు కొనసాగిస్తామని మాటిచ్చిన ప్రభుత్వం, తిరిగి వెబ్ కౌన్సెలింగ్ చేపడతామని చెప్పడంతో వివాదం ప్రారంభమైంది. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేయగా, ప్రభుత్వం దిగి వచ్చి తిరిగి మాన్యువల్ కౌన్సిలింగ్‌కు ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. ఈ కారణంగా బదిలీల ప్రక్రియలో జాప్యం చోటు చేసుకుంది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే గురువారంకూడా బదిలీల ప్రక్రియ కొనసాగుతుండడం గమనార్హం.



విద్యార్థుల రాకకు ఎదురు చూస్తున్న పాఠశాల

పూర్తి స్థాయిలో చేరుకోని విద్యామిత్ర కిట్లు

పాఠశాలలు పునఃప్రారంభించే నాటికి విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూస్, రెండు జతల సాక్సులు, యూనిఫామ్, బెల్టులు, డిక్షనరీలతో కూడిన కిట్‌ను అందజేయాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థి చేతికి కిట్ అందివ్వగా నేడు ఆ పరిస్థితి కానరావడం లేదు. జిల్లాలో 91,078 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు అందజేయాల్సి ఉంది. ఇప్పటి వరకు జిల్లాకు షూస్, సాక్సులు, యూనిఫామ్ చేరుకోలేదు. దీంతో పాఠశాలల ప్రారంభం రోజు పూర్తి స్థాయిలో విద్యార్థులకు కిట్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో పాఠశాలల పునఃప్రారంభం రోజు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు మాత్రమే అందజేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

పూర్తి కాని మనబడి-మన భవిష్యత్తు పనులు

పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి పూర్తి కావాల్సిన మనబడి - మన భవిష్యత్తు రెండవ దశ పనులు పూర్తి కాలేదు. మనబడి - మన భవిష్యత్తు రెండవ దశలో పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల్లో ఫ్యాన్లు, తాగునీటి సరఫరా, భవనాల మరమ్మతులు చేయాల్సి ఉంది. రెండవ దశ పనుల్లో భాగంగా 772 పాఠశాలలను రూ.257 కోట్లతో అభివద్ధి చేయాల్సి ఉండగా, చాలాచోట్ల సిమెంట్, ఇసుక కొరతతో పనులు నిలిచిపోయాయి.

తల్లికి వందనం ఏదీ?

గత ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో విద్యార్థుల తల్లుల ఖాతాలో ఏటా రూ.15వేలు జమ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం పథకం పేరును తల్లికి వందనంగా మార్పు చేసింది. ఏడాది గడిచినా తల్లుల ఖాతాలో సొమ్ము జమ చేయలేదు. పాఠశాలల పునఃప్రారంభం రోజున తల్లికి వందనం పేరుతో తల్లుల ఖాతాలో జమ చేస్తామని చెప్పినా రెండేళ్ల సొమ్ము ఇస్తారా అన్నదానిపై స్పష్టత లేదు.

ప్రారంభానికి ఏర్పాట్లు చేశాం



వేసవి సెలవుల తర్వాత పాఠశాలల పునఃప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. మొదటి రోజు నుంచే మధ్యాహ్న భోజనం అందించనున్నాం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమష్టి కృషితో విద్యార్థుల అడ్మిషన్స్ పెంచేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈవో, అమలాపురం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	24,500
గటగట (వెయ్యి)	22,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	23,500
గటగట (వెయ్యి)	21,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

గోదారి తీరాన సంగీత, నృత్యోత్సవం

- నేటి నుంచి అంతర్జాతీయ సంగీత, నృత్య ఫెస్ట్–2025
- నాలుగు రోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
- 13 రాష్ట్రాల నుంచి కళాకారుల రాక
- మలేషియా నుంచి రానున్న ప్రత్యేక బృందం
- 13వ తేదీన 134 మందితో నృత్య నీరాజనం

సీటీఆర్‌ఐ: నృత్య నీరాజనంతో గోదారితీరం పులకించనుంది. వంద మందికి పైగా నృత్య కళాకారులు ఒకే వేదికపై నాలుగు రోజులపాటు నగర ప్రజలను పరవశింపజేయనున్నారు. 42 ఏళ్లగా కళా సమ్మేళన్ పేరితో సంగీత, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్న శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర, భారతీయ యువ సేవా సంఘ్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 43వ కళా సమ్మేళన్ అంతర్జాతీయ సంగీత, నృత్య ఫెస్ట్–2025 గురువారం వైభవంగా ప్రారంభం కానుంది.

ఈ సమ్మేళన్‌లో 13 రాష్ట్రాల నుంచి కళాకారులు పాల్గొననున్నారు. వీరితో పాటుగా మలేషియా నుంచి ఒక ప్రత్యేక బృందం రానుంది. సుమారు 550 మంది కళాకారులు మూడు రోజుల పాటు సంగీతం, నృత్య, జానపద కళారూపాలతో పోటీ పడనున్నారు. శుక్రవారం 134 మంది తొమ్మిది గంటల తొమ్మిది నిమిషాల తొమ్మిది సెకండ్ల పాటు నిర్విరామంగా ఒకే ఆహార్యంతో నృత్యం చేయనున్నారు. వీరితో పాటు 9 మంది సంగీత విద్యాంసులు కూడా పాల్గొనున్నారు. ఈ నృత్యోత్సవాన్ని పలు రికార్డులకు నమోదు చేయనున్నారు. గత ఏడాది అంతర్జాతీయ సంగీత, నృత్యోత్సవం అనేక రికార్డులను సొంతం చేసుకుంది. 12 గంటల 23 నిమిషాల 01 సెకండ్ పాటు 125 మంది కళాకారులు ఒకే ఆహార్యంతో ప్రదర్శించిన హనుమాన్ చాలీసా నృత్యరూపకానికి 12 ప్రపంచ రికార్డులు నమోదయ్యాయి. గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్, వండర్ బుక్, తెలుగు బుక్, గోల్డెన్‌బుక్ వంటి 12 వరల్డ్ రికార్డులను ఆ కార్యక్రమం సొంతం చేసుకోవడం విశేషం. 14వ తేదీ 13న బృందాలు పోటీ పడనున్నాయి. ఒక్కొక్క బృందంలో 25 నుంచి 30 మంది వరకు కళాకారులు పాల్గొననున్నారు. 15వ తేదీ సోలో పోటీలు, సర్టిఫికెట్ల ప్రదానం చేయనున్నారు.



హనుమాన్ చాలీసా నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)

శాస్త్రీయ నృత్యానికి ఆదరణ కరవు



పాశ్చాత్య సంగీతం, నృత్యం వైపు నేటి తరం ఎక్కువగా ఆసక్తి చూపుతోంది. తల్లితండ్రులు కూడా త్వరగా తమ పిల్లలకు పేరు వస్తుందనే ఆశతో పాశ్చాత్య నృత్యం వైపు తమ పిల్లలను పంపుతున్నారు. టీవీ షోలలో అసభ్యకరమైన విన్యాసాలతో, పొట్టి డ్రెస్‌లతో చేసేది నాట్యమని భ్రమిస్తున్నారు. మన ప్రాచీన కళైన సంప్రదాయ నృత్యం వైపు ప్రపంచం చూస్తోంది. మనం మాత్రం ఆధునిక పోకడలతో తలతోక లేని డ్యాన్స్ వైపు పరుగెడుతున్నాం.

– డాక్టర్ జీవీ నారాయణ, శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర వ్యవస్థాపకుడు



9 గంటల 9 నిమిషాల 9 సెకన్ల నృత్య రూపకంలో లక్ష్మీదీపిక

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్టు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ చింతకాయలపేట రామాలయంలో ఆంజనేయస్వామి విగ్రహం బయటపడేసిన సంఘటనలో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై బి.జగన్మోహనరావు బుధవారం తెలిపారు. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. కొన్ని సీసీ పుటేజీలతోపాటు రామాలయం వద్ద లభించిన ఆధారాలతో కొత్తపెరుమాళ్లపురానికి చెందిన తిర్రి ప్రసాద్‌గా గుర్తించామన్నారు. ఈ మేరకు అరెస్టు చేసి కోర్టు ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

అమలాపురం టౌన్: అమలాపురం మెయిన్ రోడ్డులోని మలబార్ గోల్డ్ షోరూమ్‌కు ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మోటారు సైకిలిస్ట్ గాయపడ్డాడు. సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మలికిపురం మండలం తూర్పుపాలేనికి చెందిన కొల్లు కుమారస్వామి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. కుమారస్వామి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై ఎస్ఎస్ కిషోర్‌బాబు తెలిపారు.

క్లుప్తంగా

గల్లంతైన మృతదేహం లభ్యం



వాసాలతిప్పలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ దివాకర్, ఎస్‌ఐ రాజేష్

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం బీచ్‌కు స్నానాలకు వెళ్లి సముద్రంలో మంగళవారం గల్లంతైన ఇద్దరిలో రెండో యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన యాళ్ల హరికిశోర్ మృత దేహం మంగళవారమే లభ్యమైనప్పటికీ మరో యువకుడు ఇసుకపట్ల జస్వంత్ కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం ఉదయం వాసాలతిప్ప సముద్రతీర ప్రాంతంలో లభ్యమైనట్టు ఎస్సై సీహెచ్ రాజేష్ తెలిపారు. ఆ మృత దేహాన్ని తహసీల్దార్ వీఎస్ దివాకర్, ఎస్‌ఐ రాజేష్ పరిశీలించి పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించి కుటుంబ సభ్యులకు అందించారు.

యువకుడి ఆత్మహత్య



కృష్ణచైతన్య మృతదేహం

యానాం: పిన్ని ఇంటికి వచ్చి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం యానాం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణం, జయంతి కాలనీకి చెందిన గంథ్రాపు వెంకటకృష్ణచైతన్య (24) యానాంలో వికాస్‌కాలనీలో నివాసం ఉంటున్న తన పిన్ని ఇంటికి ఇటీవల వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతున్న కృష్ణచైతన్యను చూసిన బంధువులు హుటాహుటిన కిందకు దింపి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కృష్ణచైతన్య బీటెక్ చదువుకున్నాడని ఆత్మహత్యకు ప్రేమ వైఫల్యమే కారణమని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై పెంకే గణేష్ తెలిపారు.

పీతల సరఫరాలో ఘరానా మోసం

- పచ్చ పీతలకు బదులు మండ పీతలు పంపిన హేచరీ యాజమాన్యం
- రూ.14 లక్షలు నష్టపోయిన రైతులు

కాట్రేనికోన: పచ్చ పీత పిల్లలకు సొమ్ము చెల్లిస్తే మండ పీత పిల్లలను అంటగట్టి రైతులకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన పల్లం గ్రామంలో చోటు చేసుకుంది. మండలం పల్లం గ్రామానికి చెందిన 26 మంది రైతులు 50 ఎకరాలు పీతల చెరువులు లీజుకు చేస్తున్నారు. పచ్చ పీత పిల్లల కోసం స్థానికం హేచరీ అందుబాటులో లేక పోవడంతో మద్రాసుకు చెందిన హేచరీ నుంచి పీత పిల్లలను పల్లం గ్రామానికి చెందిన పాలెపు శ్రీను, సంగాని సత్యంకు సొమ్ము చెల్లించారు. 26 మంది రైతులు ఒక పీత పిల్లకు రూ.23 చొప్పున 60 వేల పిల్లలకు రూ.14 లక్షలను దళారులు పాలెపు శ్రీను, సంగాని సత్యంలకు చెల్లించారు. అయితే పచ్చ పీత పిల్లలకు బదులు నకిలీ పీతలను (మండ పీతల) సరఫరా చేయడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళ చెరువులో పీత పిల్లలను వదలడం, సీడ్ దశలో ఉండడం వల్ల అసలో నకిలీయో తెలియదని వారు పేర్కొన్నారు. చెరువులో పీతలు వేసి 20 రోజులు పైబడిందని, పచ్చ పీతలకు బదులు మండ పీతలని తేలడంతో మోసపోయినట్టు గుర్తించామని, మండ పీత పిల్లలను సరఫరా చేసిన హేచరీ యాజమాన్యం పైన, దళారులపై కేసు నమోదు చేయాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దళారులు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

ఉసురు తీసిన వివాహేతర సంబంధం

- భర్తను హత్య చేసిన భార్య
- ప్రియుడితో కలసి పరారీ



మృతిచెందిన కెంగం శ్రీను

బిక్కవోలు: ప్రియుడి మోజులో పడి కట్టుకున్న భర్తనే కడదేర్చింది ఆ ఇల్లాలు. సీఐ వీఎల్‌వీకే సుమంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బిక్కవోలు గ్రామంలోని కెంగం శ్రీను (43) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నారు. స్థానిక జగనన్న లే అవుట్ ప్లాట్ నంబర్ 59లో భార్య దేవితో కలసి కాపురం చేస్తున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు కాగా పెద్దవాడు సురేంద్ర సత్యకుమార్ నర్సాపురం మండలం సీతారామపురంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండో కుమారుడు యశ్వంత్‌కుమార్ పోలవరం మండలం గుటాల గ్రామంలో తాపీ పని చేస్తుంటాడు. దేవి బిక్కవోలులో అంబటి పేట ప్రాంతానికి చెందిన జంపా దుర్గారావుతో వివాహేతర సంబంధం నెరపుతుండడంతో ఆ భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. తల్లి వివాహేతర సంబంధాన్ని చూస్తూ ఉండలేక చిన్న కుమారుడు గుటాలలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లి పని చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మళ్లీ శ్రీను, దేవి ఘర్షణపడ్డారు. ఈ ఘర్షణలో శ్రీను మృతి చెందాడు. బుధవారం ఉదయం శ్రీను తల్లి సరస్వతి ఇంటికి రాగా విగతజీవుడై పడి ఉన్న శ్రీనును చూసి కన్నీరుమున్నీరైంది. అనంతరం దేవి తన ప్రియుడు దుర్గారావుతో కలసి శ్రీనును చంపినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీఎస్పీ శ్రీవిద్య, సీఐ సుమంత్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్రీను భార్య దేవి, దుర్గారావు పరారీలో ఉన్నారని వారిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని వారు తెలిపారు. శ్రీను మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీకి తరలించినట్టు సీఐ తెలిపారు.

సత్యదేవుని సన్నిధికి సులువుగా!



మెట్లదారి పనులను పరిశీలిస్తున్న సీఈ జీవీ శేఖర్ తదితరులు



మెట్లదారి మధ్యలో భక్తులకు విశ్రాంతి షెడ్లు, మంచినీటి సదుపాయం ఏర్పాటుకు చదును చేస్తున్న స్థలం

- చురుగ్గా రెండో మెట్లదారి నిర్మాణం
- రూ.90 లక్షలతో 450 మెట్లు ఏర్పాటు
- ఆగస్టు నెలాఖరుకు అందుబాటులోకి

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సత్యదేవుని దర్శనానికి మరో మార్గానికి పనులు చురుగ్గా సాగుతున్నా యి. మొదటి ఘాట్‌రోడ్డు వద్ద గల టోల్‌గేట్ నుంచి స్వామివారి ఆలయం సమీపం వరకు నిర్మిస్తున్న రెండో మెట్లదారి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. రూ.90 లక్షల వ్యయంతో సుమారు 450 మెట్లతో ఆకర్షణీయంగా ఈ మార్గం రూపుదిద్దుకుంటోంది.

రాజస్థాన్ కార్మికుల మెళకువలతో

రాజస్థాన్ నుంచి తీసుకువచ్చిన మెషీన్‌తో అందమైన పరిమాణాల్లో కట్ చేసిన రాళ్లను మెట్లుగా తీర్చిదిద్దుతున్నారు. తొలిపావంచా నుంచి స్వామివారి ఆలయానికి ఉన్న ప్రస్తుతం మెట్లను సుమారు 50 ఏళ్ల క్రితం రాతితో నిర్మించారు. కాగా ప్రస్తుతం నిర్మిస్తున్న రెండో మెట్లమార్గానికి గ్రానైట్, మార్బుల్ రాళ్లను యంత్రాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

2010లోనే ప్రతిపాదన

2010 సంవత్సరంలో అప్పటి ఈఓ, ప్రస్తుత దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఈ మెట్ల దారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దేవస్థానం కళాశాల మైదానంలో సందర్శకుల బస్సులు, ఇతర వాహనాలను నిలిపి అక్కడి నుంచి తొలి పావంచా వద్దకు నడిచి వెళ్లి అక్కడ నుంచి మెట్లపై స్వామివారి దర్శనానికి వెళ్లాల్సివచ్చేది. ఇది దూరాభారం కావడంతో కళాశాల మైదానానికి దగ్గరలో మరో మెట్లదారి నిర్మించాలని ఆయన సంకల్పించారు. ఇంతలో ఆయన 2012లో బదిలీకావడంతో ఆ ప్రతిపాదన మూలపడింది. మళ్లీ 2023లో ఆయన ఈఓగా రావడంతో ఈ మెట్ల మార్గం పనులకు టెండర్లు పిలిచి ఖరారు చేశారు.



సత్యనారాయణ స్వామివారి దేవస్థానం

మూడు మలుపులు, 450 మెట్లు

ఈ మార్గాన్ని 450 మెట్లతో మూడు మలుపులతో నిర్మిస్తున్నారు. మొదటి ఘాట్‌రోడ్ టోల్‌గేట్ నుంచి మెట్లు ప్రారంభమై రత్నగిరిపై ఓల్డ్ సీసీ, న్యూ సీసీ సత్రాల రోడ్డు వద్ద ముగియనున్నాయి. అక్కడ నుంచి 200 మీటర్ల దూరంలోనే స్వామివారి ఆలయం ఉంటుంది.

గత ఏప్రిల్‌లో ప్రారంభించిన పనుల్లో భాగంగా వంద మెట్లు పూర్తి చేశారు. ఇంకా 350 మెట్లు నిర్మించాల్సి ఉంది. ఈ మెట్లకు అవసరమైన రాయిని ప్రత్తిపాడులోని క్వారీ నుంచి తీసుకువచ్చి మెట్లుగా తీర్చిదిద్దుతున్నారు.

భక్తుల విశ్రాంతికి ఏర్పాట్లు

మెట్ల మార్గంలో వెళ్లే భక్తులు అలసట చెందితే విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా షెడ్లు, తాగునీటి సదుపాయానికి పక్కనే కొంత స్థలాన్ని చదును చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

మూడు నెలల్లో పూర్తి

ఈ మెట్ల నిర్మాణాన్ని ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తిచేయనున్నట్టు దేవస్థానం ఈఈ వి.రామకృష్ణ, డీఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.

పనుల పరిశీలన

దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ జీవీ శేఖర్ ఈ మెట్ల మార్గం పనులను ఇటీవల పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో ఓవరాల్ చాంప్స్ 'తూర్పు'

67 పతకాలు కైవసం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 11 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల తైక్వాండో పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జట్టు పాల్గొని ప్రతిభ కనపరచిందని తైక్వాండో సంఘ జిల్లా కార్యదర్శి బి.అర్జునరావు బుధవారం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి 80 మంది ఈ పోటీలలో పాల్గొనగా 38 బంగారు, 12 రజత, 17 కాంస్య పతకాలు సాధించి జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారన్నారు. కడప జిల్లా ద్వితీయ స్థానాన్ని, అనంతపురం జిల్లా తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయని తెలిపారు. ఈ పోటీలో జాతీయస్థాయి రిఫరీలు భార్గవి, సాయి, రోహిత్ జిల్లా నుంచి పాల్గొనగా తైక్వాండో కోచ్‌లు సత్యనారాయణ, మణికంఠ, త్రిమూర్తులను అర్జునరావు అభినందించారు.



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు

వ్యక్తి అనుమానాస్పద మృతి



వీరభద్రరావు మృతదేహం

తుని: స్థానిక జాతీయ రహదారి కొండవారిపేట ప్రాంతంలో ఉన్న చర్చి ఎదురుగా ఉన్న పొదల్లో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని ఆయన తెలిపిన వివరాల మేరకు పిఠాపురం రూరల్ మండలం కోలంక గ్రామానికి చెందిన నంద్యాల వీరభద్రరావు (40)గా మృతుడిని గుర్తించారు. ప్రస్తుతం వీరభద్రరావు కుటుంబ సభ్యులను విచారిస్తున్నామన్నారు. ప్రమాదమా, లేదా హత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేస్తున్నామని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.

చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం



సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించిన అనుమానితులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో పట్టపగలు జరిగిన చోరీపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక జాతీయ రహదారిపై నరేంద్రగిరి ఎదురుగా ఉన్న భవనంలో పట్టపగలే చోరీ జరిగిన సంగతి తెలిసిందే. పోలీసులు ప్రాథమికంగా 2.1 కేజీల వెండి, మూడు బంగారు గొలుసులు అపహరణకు గురైనట్టు భావించారు. అయితే ఇంటి యజమాని కంటిపూడి శివానంద భాస్కరరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యింది. సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. దీని ఆదారంగా ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాచీన ఆలయాల సందర్శన

బిక్కవోలు: స్థానికంగా కొలువైన లక్ష్మీ గణపతి ఆలయం, గోలింగేశ్వరస్వామి ఆలయాలను పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పరమపూజ శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) సందర్శించారు. బుధవారం బిక్కవోలుకు చెందిన ఆర్యవైశ్యుల విజ్ఞప్తి మేరకు ఆయన వచ్చారు. తొలుత ఆయనకు ఆర్యవైశ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో దిగవల్లి వెంకటేశ్వరరావు, శ్రీరామ్మూర్తి, కుసుమంచి వెంకటేశ్వర్లు, శివన్నారాయణ, నాగులకొండ సూర్యప్రకాష్, బొండాడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలులోని ఆలయంలో ప్రజ్ఞానంద సరస్వతి

వర్షాధార తోటలకు ప్రోత్సాహం

కాకినాడ సిటీ: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో వర్షాధార పండ్ల తోటల పెంపకానికి చర్యలు చేపట్టినట్టు డ్వామా పీడీ వెంకటలక్ష్మి బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా 16 రకాల పండ్ల తోటలు, 2 రకాల పూల తోటలు, మునగ పంటలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతుల పొలాల్లో మామిడి, చీనీ బత్తాయి, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోట, కబ్బరి, అల్లనేరేడు, చింత, సీతాఫలం, అంజూర, బెర్, అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ, మల్లె, మునగ తదతర ఉద్యాన పంటల నిర్వహణ ఖర్చులు పంటను బట్టి 100 శాతం ఉచితంగా 2 నుంచి 3 ఏళ్లు వరకు చెల్లిస్తారన్నారు. రెండేళ్లలో కాకినాడ జిల్లాలో 678.78 ఎకరాల్లో పెంపకం లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఆసక్తిగల, అర్హులైన జాబ్‌కార్డు కలిగిన రైతులు సంబంధిత ఎంపీడీఓ లేదా ఎన్ఆర్ఈజీఎస్ అదనపు కార్యక్రమాధికారి, గ్రామ క్షేత్ర సహాయకులకు దరఖాస్తులు అందించవచ్చన్నారు.

ఏడీబీ రోడ్డుపై లారీ దగ్ధం



రంగంపేట వద్ద ఏడీబీ రోడ్డుపై దగ్ధం అవుతున్న కాంక్రీట్ మిల్లర్ లారీ

రంగంపేట: స్థానిక శివారు ఏడీబీ రోడ్డుపై బుధవారం కాంక్రీట్ మిల్లర్ లారీ దగ్ధమైంది. ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా కాంక్రీట్ తీసుకువచ్చిన లారీ అన్‌లోడింగ్ అనంతరం డ్రైవర్ లారీని రోడ్డుపై పార్కు చేసి పక్కకు వెళ్లారు. అనంతరం లారీపై ఉన్న విద్యుత్తు తీగలు గాలికి కదిలి తాకడంతో ఒక్కసారిగా లారీ టైర్ల నుంచి మంటలు వచ్చి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో లారీలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

850 లీటర్ల అక్రమ డీజిల్ పట్టివేత



అక్రమ డీజిల్ తరలిస్తున్న వాహనంతో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న 850 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని ఉప్పాడకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట చేసినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. జాతీయ రహదారి 216 లోని పి.మల్లవరం చెక్ పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీలలో అక్రమ డీజిల్ పట్టుబడిందన్నారు. నిందితులను అరెస్ట్ చేసి బొలెరో వాహనంతో పాటు సుమారు 850 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.